# నేనూ - మా కల్యాణి

యస్. సామ్రాజ్యలక్ష్మి

ఏమంటారోయ్ ఒక్కమాట ! యిప్పుడు నేను చెప్పబోయేదంతా అతిశయోక్తి, అబద్ధం అనుకునేరు. ఇది నూటికి నూరుపాళ్ళు కరెక్టు. నన్ను నమ్మండి. మా ఆవిడలాగా మీరుకూడా నమ్మాలా !.. అయినా అది ఆవిడ అన్న పదంలోను, ఆ బాంధవ్యంలోను వస్తుందిలెండి. . . మీరంతా నాకు సోదర సోదరీమణులు కాబట్టి తప్పకుండ నన్ను నమ్ముతారు కదూ !. . . ఇంక వినండి నా ఆత్మకథ.

నేను పాతికేళ్ళ యువకుడిని. నాపేరు శర్మ. గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాను. నా శ్రీమతి పేరు కల్యాణి. సెకెండుఫారం వరకు చదువుకుంది. మా యిద్దరికి పెద్దలు చిన్నప్పుడే వివాహం చేశారు. మా నాన్నకు నేనొక్కడినే సుపుత్రుడినవటం దానికి కారణం. మా శ్రీమతి కాపురానికి వచ్చి అయిదేళ్ళయింది. ముగ్గురు పిల్లలు. వాళ్ళని పిల్లలనటం ఏదో అది వాడుకపడం కాబట్టి అనాల్సిందే కాని నిజానికి వాళ్ళు పిల్లలు కారండి. మన భారత యుద్ధవీరులుగా పనికివచ్చే సిపాయిలు. నిజానికి మన సరిహద్దులలో పోరాడుతున్న వీరులుకూడా మా సంతతిలాగా లేరేమో ! ఆఁ.. పిల్లల సంగతి వదిలేసి అసలు సంగతికి వస్తాము . . . అదేమిటంటే మా శ్రీమతి పరిస్థితి మీకర్థం కాదు. మొదటినుండి చెప్పుకొస్తాను. మా శ్రీమతి వాళ్ళ అమ్మ నాన్నకి జ్యేష్ఠ పుత్రిక. అందుచేత గారాబం ఎక్కువయిపోయింది. అమ్మాయి స్కూలుకు చాలాదూరం పోవాలి. పాపం పసిపిల్ల. ఏమైపోతుందిలే . . . ఏం చదువులు ! ఉద్యోగాలు చెయ్యాలనా ఊళ్ళేలనా ఎవడోకడినిచూచి ముడిపెడితే నిక్షేపంగా కాపురం చేసుకుంటుంది. అనుకున్నారు. "ఆ ఎవడో ఒకడిని" అనుకున్నారే దురదృష్టవశాత్తు నేనే అయినాను వాడిని.

హైదరాబాద్‌లో కాపురం పెట్టాము. ఒక్కటే గది. మధ్యలో తెరకట్టి వంటయిల్లు, బెడ్‌రూమ్ చేసుకున్నాము. అబ్బ . . . మీరేమన్నా అనకోండి. ఆ మొదటిరోజు చేసిన వంట ముఖ్యంగా అన్నం నాకు యిప్పటికీ జ్ఞాపకం వస్తుంటుంది. నేను అసలే బద్ధకస్తుడిని. దానికితోడు మా శ్రీమతిగారు వచ్చిన క్రొత్త అవటంతో ప్రొద్దున ఎనిమిది గంటలదాకా మెలకువ వచ్చేది కాదు. తొమ్మిదిన్నరకు ఆఫీసుకు బయలుదేరాలి. ఈ లోపల పాపం మొగుడికి వండి పెడదామన్న ఉద్దేశ్యంతో మా కల్యాణి ముందు తను కాఫీ త్రాగి ఆ కుంపటి మీదనే అన్నం పడేసిందట. ఇదంతా కల్యాణి చెప్పిందిలెండి తర్వాత. ఇద్దరికీ రెండు డబ్బాలు మరీ గీసినట్లవుతుందేమో ! ఒక మెతుకు అటూ యిటూఅయినా ఇంకో డబ్బా పోసిందిట. కొద్దిసేపటికి ఉడికింది. ఉడికిన తర్వాత గరిట గ్రుచ్చి అన్నం తీసి చూడాలని వాళ్ళ అమ్మమ్మ ఎప్పుడో చెప్పిన గుర్తుట. అందుకని గరిట గ్రుచ్చి కాస్త అన్నం పైకి తీసిందిట. ఊరికే చూస్తే ఎలా తెలుస్తుంది అని రెండు మెతుకులు నోట్లో వేసుకుందిట. అబ్బ . . . ఏమిటి యిలా గట్టిగా వున్నదని ఇంకొంచెం నీళ్ళు పోసిందట. నానా అవస్థా పడుతున్నది. అన్నమంతా పొంగి నిప్పులోపడి ఒకటే వాసన. మెలకువవచ్చిననాకు కల్యాణి అవస్థకు నవ్వాగింది కాదు. "ఏమిటి కల్యాణి ! అంత అవస్థ పడుతున్నావు ! నన్ను లేపకపోయావా !" అన్నాను.

"నిద్రపోతున్న వారిని లేపట మెందుకని లేప లేదు."అన్నది బిక్కముఖం వేసి. నాకు జాలి వేసింది. క్రొత్తకదూ! పాపం అనుకొన్నాను. ఆ అన్నం ఎలా తయారయిందంటే ఒకవైపు కాస్త పలుకుగావున్న అన్నం. మూడవవైపు ఒకమాదిరిగా వుడికిన అన్నం. నాలుగోవైపు సుద్ద. ఇంక ఆరోజు అన్నం తినటానికి పడిన అవస్థ మీరే ఊహించుకోండి !

పదిరోజులకి కాని అన్నం కాస్త పదునుకి రాలేదు. ఇప్పటికి కూడా ఎవరైనా చుట్టాలు వచ్చిన రోజున అలా అవటం కద్దు మరి చుట్టాలని చూచే టప్పటికి భయంవల్లనో లేక వారితో మాట్లాడుతూ సరిగా చూడక పోవటం వల్లనో దేనివల్లనయితే నేమి ఆరోజు అన్నం చతుర్విధమే! అందుకని నేను ముందరే జాగ్రత్తపడి "ఏమోయ్ కల్యాణీ ! ఆ ఉత్తరం వైపు అన్నం మాకు వడ్డించు" అంటాను. ఎందుకంటె అటువైపుది కాస్త ఉడికి వున్నదన్న మాట.

సరే అది అలావుండగా మా కల్యాణి వచ్చిన ఇరవై రోజులకు ఒక శనివారం నాడు "కల్యాణీ ! ఇవాళ సినిమాకు వెళ్దాం. రేపు ఆదివారమేగా రెస్టు తీసుకోవచ్చు నేను త్వరగా వచ్చేస్తాను. నీవు రెడీగా వుండాలి." అన్నాను ఆఫీసుకి వెళ్తూ. 'అలాగే'నంది.

సాయంత్రం అయిదుగంటలకి ఆఫీసునుండి హుషారుగా కల్యాణి ఏడ్రస్సులో ఎలారెడీ అయిందా అనుకుంటూ వచ్చాను. వచ్చేటప్పటికేముందీ. చీపురు కట్ట పట్టుకుని చీరె కుచ్చెళ్ళు పైకి దోపుకొని చిమ్ము తున్నది యిల్లు ఆ అవతారం చూచేటప్పటికి నేను నీరుగారి పోయినాను.

"అదేమిటి కల్యాణీ ! యింకా యిలాగే వున్నావు ! సినిమాకి వెళ్దామని చెప్పాను కదా మరచి పోయినావా అన్నాను.

"నేనేం మరచి పోలేదండీ ! ఏడింటికి కదా అప్పుడే ఏం తొందర అన్నది !

"ఏడింటి కా " అన్నాను ఆశ్చర్యంగా.

"అవును మరి మా మాజీవీడులో ఏడుగంట లకే చూపిస్తారు సినిమా మేము ఎంచక్కా భోజనాలు కూడా చేసిపోతాము. ఇంకా జనం గనక రాకపోతే ఒక్కొక్కసారి ఎనిమిది కూడా అవుతుందండి" అన్నది కళ్ళు యింతింత పెద్దవిచేసి.

నాకు వళ్ళు మండిపోయింది. "ఇదేం మీ మాజివీడు అనుకున్నావా?" అన్నాను కోపంపట్ట లేక.

పాపం ! నేను కోపంగా అనేటప్పటికి కల్యాణి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగినయి నా ముఖంలోకి చూడలేక కాబోలు వంగి గబగబా యిల్లు చిమ్మేస్తు న్నది. నా ఉద్రేకం అణిగి మామూలు స్థితికి వచ్చిన తరువాత చాలా బాధపడ్డాను నేను వెళ్ళేటప్పుడు టైము ఎందుకు చెప్పివెళ్ళలేదా అని నన్ను నేనే తిట్టు కున్నాను పాపం పల్లెటూరి పిల్ల. ఇక్కడి పరిస్థితు లేం తెలుస్తాయి ! అని నన్ను నేనే సమాధాన పరుచు కొని వెళ్ళి కల్యాణీ ! కోపం వచ్చిందా ! నేను ఆ కోపంలో ఏదో అన్నాను. ఏమనుకోకు. పోనీలే . . . వచ్చే శనివారం వెళ్దాము." అన్నాను కల్యాణిని దగ్గరకి తీసుకుంటూ.

అలా జరిగింది మా మొదటి సినిమా ప్రయా ణం. సరే. మర్నాడు ఆదివారం కదా పోనీ అలా గార్డెన్‌కి వెళ్ళొద్దాము అన్నాను మా కల్యాణితో.

"ఇవాళ్ళయినా టైము చెప్పండి. తర్వాత నన్నని లాభంలేదు" అన్నది ముఖం అదోలాపెట్టి.

నాకు నవ్వువచ్చింది. "ఇది గార్డెన్, సినిమా కాదు. పిచ్చిపిల్లా ! దీనికేమిటైము లేదులే. మనిష్ట మైనప్పుడు వెళ్ళోచ్చు. అయినా త్వరగా కానీయ్

అయిదింటికల్లా వెళ్దాం" అన్నాను కల్యాణి అమాయకత్వానికి నవ్వుకుంటూ.

సాయంత్రం నాలుగున్నర అయింది. నిద్రపోతున్న నన్ను లేపింది. "లేవండీ! నాలుగున్నర అయింది వెళ్దాము. నేనంతా రెడీ. మీదే ఆలస్యం" అంటూ.

కళ్ళుతెరచి ఒక్కక్షణం కల్యాణి వైపు చూశాను.

ముదురు నీలంరంగు జరీ చీరె. తెల్లజాకెట్టు మెడలో రెండుపేటల చంద్రహారం నల్లపూసలు. ముఖాన దమ్మిడీ అంత మామిడి చిగురు కుంకుమ. గట్టిగా రెండురోజులవరకు చెరగని జడ. నడినెత్తిన ఒకపాతిక చామంతి పూలు, కొసన ఎర్రటి రిబ్బను. ఆహా . . . కల్యాణీ! ఏమి డెకొరేషన్ అనుకున్నాను మనస్సులో. గట్టిగా ఏమన్నా అంటె ఏడుస్తుందేమోనని "కల్యాణీ యిలా కూర్చోఅని ప్రక్కన కూర్చోపెట్టుకుని. "ఈ చీరె మీ అమ్మావాళ్ళు కొనిచ్చారా? . . . బాగుంది కల్యాణీ . . ." అన్నాను కల్యాణి ముఖం చేటంత అయింది. "బాగుందాండీ! . . . నేనే కావాలని కొనుక్కున్నాను" అంది సంతోషంగా. ఆవిడకి సంతోషం. నాకు వళ్ళుమంట. "అవునుగాని ఇప్పుడెందుకు కట్టుకున్నావు యింత మంచి చీర . . . రేపేదైనా పేరంటానికిగాని పెళ్ళికిగాని వెళ్ళినప్పుడు కట్టుకుందువుగాని ఇది విప్పేసి మొన్న నేను మీ పూరువచ్చేటప్పుడు తెచ్చానే లేత గులాబి రంగు సిల్కు చీరె అది కట్టుకో." అన్నాను పైకైనంత నెమ్మదిగా చెప్పాలని ప్రయత్నిస్తూ.

ముఖం చిట్లిస్తూఅన్నది కల్యాణి "అదేమిటండీ! బాగుందంటు విప్పమంటారు. ఆ లేత గులాబి చీరె ఏంబాగుంది! వూర్కే మాసిపోతుంది."

"మాసిపోవటానికి నువ్వేం అక్కడ అంట్లు తోమవుగా" అని మనస్సులోనే అనుకొని "నీకు తెలియదు కల్యాణీ ఆలేతరంగులే బాగుంటయి ఈ ఊళ్ళోఅందరూ అవే కట్టుకుంటారు. నువ్వు యిట్లా వచ్చావంటే నిన్నూనిన్ను కట్టుకున్న నన్ను యిద్దర్నీ వింతగా చూస్తారు." అన్నాను ఎంత ఆపుకుందామన్నా ఆగక ఆ మాటలు వచ్చేసినయి. అవిబాగానే పనిచేసినయి కల్యాణి మీద.

"మీ ఇష్టం" అంటూ వెళ్ళి ఆ చీరె కట్టుకొచ్చింది. ఇంకమిగిలినవి కూడా నాకు తెలిసినంత మట్టుకు దిద్దించి ఎలాగో బయటపడి గార్డెన్‌కి తీసుకు వెళ్ళాను ఆ రోజు. స్కూటర్స్‌మీద స్లీవ్‌లెస్ జాకెట్స్‌తో భర్తల నడుములు గట్టిగా పట్టుకుని వెళ్తున్న జంటలను వెనక్కల్లా తిరిగి నోరుతెరచి చూస్తున్న మా కల్యాణిని భుజంతట్టి యీ లోకం లోకి తెచ్చి ఇంటికితెచ్చి పడేసేటప్పటికి నాపనయిందనుకోండి!

ఇలాగే కల్యాణిని మార్చాలని. నా ఊహాలకి అనుగుణంగా దిద్దుకోవాలని ప్రయత్నిస్తూ, కాస్త ప్రపంచాన్ని చూచయినా నేర్చుకుంటుందేమోనని, ప్రతి శని ఆదివారాలు ఎక్కడికయినా తీసుకువెళ్తూ వుండేవాడిని, ఇలావుండగా ఒకరోజున మా నాన్నగారు మా క్రొత్తకాపురం చూద్దామని వచ్చారు. నేను ముందరే చెప్పాను గదా ఎవరైనా వచ్చిన రోజున అన్నం చతుర్విధమని. అందుకని ముందరే వెళ్ళి ఏదిక్కున అన్నం బాగున్నదో స్వయంగా చూచి వచ్చి మా నాన్న ప్రక్కన కూర్చుని "కల్యాణీ! ఆదక్షిణంవైపు అన్నంవడ్డించు" అన్నాను మా నాన్నకి కోడలి ప్రతాపం తెలియచేయాలని.

ఆయన ఆశ్చర్యపోతూ "అదేమిటిరా మీ ఇంట్లో దిక్కుకో అన్నం వండుకుంటారా ఏమిటి?" అన్నారు.

"దిక్కుకో అన్నంకాదు నాన్నె ఒకగిన్నెలోనే నాలుగుదిక్కులా నాలుగు రకాలు వండుకుంటాం".

"అదేమిటిరా" . . .

"అవును నాన్నా యిప్పుడు నీవు వచ్చావు. నీకు మెత్తగా కావాలి. నాకు పొడిగా కావాలి. ఇన్ని రకాలు యిన్నిగిన్నెలు వండాలి కదా అందుకుని నీ కోడలు పొదుపుగా ఒకే గిన్నెలో నాలుగువైపులా నాలుగు రకాలుగా వండుతోంది." అన్నాను వళ్ళు మండి పోతూంటే కోపంగా.

"అదా . . . సంగతి "— అని నవ్వి " పోనీ లేరా . . . చిన్నపిల్ల. నాలుగురోజులు పోతే అదే నేర్చుకుంటుంది." అన్నాడు.

నాలుగు ఘాటుగా ఏమన్నా అంటిస్తాడేమో. బుద్ధివచ్చి జాగ్రత్తగా చేస్తుందేమో ననుకుంటె కోప్పడటంపోయి పైన సమర్ధిస్తున్న మా నాన్న మీద కోపం ముంచుకువచ్చింది. ఏం చేయగలను ?

ఇంక ఆరాత్రి వున్నది ఒక్కటె గదిగా ; తెరకి అవతలంతా వంటసామాగ్రి. మా నాన్న ఎక్కట పడుకోవాలి అన్నది సమస్య. పోనీ బయట వరండాలాటిదేమైనా వున్నా పడుకోమనే వాళ్ళం. బయట ఉత్త ఆరుబయలు, అందులో చలికాలం. ఎలా ! నేను మధన పడుతూంటే మా కల్యాణి నా మంచం ప్రక్కనే మంచంవేసి మీ నాన్నగారిని పడుకోమనండి అన్నది. పక్కవేస్తూ. "మరినువ్వు" అన్నాను. సంజ్ఞతో మా నాన్న చూడకుండా. నేను అక్కడా అంటూ వంటగది చూపించింది.

"చచ్చాంరా భగవంతుడా"అనుకున్నాను. ఇక చూడండి మా నాన్న వున్న ఆవారం రోజులు నాఅవస్థ. మాకల్యాణి మాత్రం హాయిగా గుర్రుపెట్టి నిద్రపోతుం దేది. మా నాన్నని అనటానికి వీల్లేదు లెండి. కల్యాణే బలవంతం చేసి ఫర్వాలేదులెండి ఆరు బయలు మరీ చలి. జబ్బుచేస్తుంది అంటూ చిలక్కి చెప్పినట్లు చెప్పిందామె ! మధ్యలో అవస్థ పడ్డది నేను.

ఇది కాపురానికి వచ్చిన క్రొత్తల్లో పరిస్థితి. ఇంక యిప్పటి పరిస్థితి వినండి. ఇప్పుడు ముగ్గురు పిల్లలని చెప్పాను గదా ! పని ఎక్కువవటం వలన ఓవర్‌టైము చెయ్యవలసి వస్తున్నది. వచ్చేటప్పటికి రాత్రి దాదాపు తొమ్మిదవుతుంది. ప్రొద్దుటి నుండి ఆఫీసులో కొట్టుకుని కొట్టుకుని వస్తానా యింటికొస్తే గంటసేపు తలుపు కొడితేగాని తలుపు తెరువబడదు. ఈ లోపల మా సందులో కుక్కలు "బౌవ్" మని మొరుగుతయి. నేను తలుపు కొట్టిన శబ్దానికే లేస్తుందో లేక ఆ కుక్కల అరుపులకే లేస్తుందో ఎలా గయితేనేం వచ్చిన గంటకి తలుపు తెరుస్తుంది తీరిగ్గా. అంత సునిశితమైన నిద్రన్నమాట. ఎలాగో ఓర్చుకుని లోపలపడతాను. నాపనులు పూర్తయేలోపల మా కల్యాణి వడ్డిస్తుంది. భోజనం చేసిన తర్వాత పోయిన ప్రాణం తిరిగి చేరుకుంటుంది. ఇంక అప్పుడు నాకు తీరిక. ఏదో వారపత్రిక చేత్తో పట్టుకుంటాను. నాలుగు పేజీలు కాస్త త్రిప్పి చూస్తానోలేదో అప్పుడే ఎప్పుడు వచ్చి పడుకుంటుందో కల్యాణి చంటివాడిని పక్కలో వేసుకుని గుర్రుపెడుతుంటుంది. నాకు అరి కాలుమంట నెత్తికెక్కుతుంది. ఏదో చచ్చి చచ్చి వస్తాను కదా. కాస్త మాట మంచి ఏమి వుండదు. నా ఖర్మ నిజంగా మా కల్యాణి నిద్రను మెచ్చుకో వలసిందే. కంటిరెప్పలు రెండు కలుసుకోవటం ఆలస్యం నిద్రవచ్చేస్తుంది

ఎప్పుడూ పిల్లలని తిటటం, కొట్టటం, వాళ్ళ కింత వండటం, పెట్టటంతో సరి ఇవతల ఒక మొగుడనే వాడువున్నాడని. వాడికేమైనా కాస్త చూడా లని వుంటేగా . . ఛీ . ఛీ . . ఆఫీసునుంచి వచ్చే టప్పుడు సైకిల్ మీద కూర్చుని "నేను వెళ్ళేటప్పటికి మా కల్యాణి ఏమిచేస్తూందో ! తెల్లటి చీరె . . . తలలో పూలు . . . గుమ్మంలో నుంచుని ఎదురు చూస్తూ వుంటుందేమో ! అనుకుంటూ వచ్చిన నాకు గుమ్మంలో కల్యాణి కనపడక పోగా తలుపుకి తాళం కనిపిస్తుంది. ఏ ప్రక్క ఇంట్లోనే పెత్తనం చేస్తూ వుంటుంది. ఇప్పుడలాంటి ఆలోచనలు కూడా రావను కోండి. ఎందుకంటారా మా కల్యాణి అలావేసింది.

నాతో ఒక్కవిషయం, ఒక్కమాట, ఒక్క పనిలోకూడా ఏకీభవించదు కదా మా కల్యాణి. ఏం చేయను చెప్పండి !

*